# లే క్యూటీ.. పాలంకాడికి పోదాం..

- ఇసుక ట్రాక్టర్ కిందపడి పెంపుడు కుక్క మృతి
- తల్లడిల్లిన యజమాని

వెంకటాపూర్‌లో చనిపోయిన పెంపుడు కుక్క వద్ద రోధిస్తున్న బాల్‌లింగం

ఎల్లారెడ్డిపేట, మార్చి 26: అప్పటి వరకు తమతో ఆడుకున్న పెంపుడు కుక్క ఇసుక ట్రాక్టర్ కింద పడి మృతి చెందగా దాని యజమాని తల్లడిల్లిపోయాడు. 'లెవ్వు బిడ్డా.. క్యూటీ పొలంకాడికి పోదా'మంటూ వెక్కివెక్కి ఏడ్చాడు. వివరాల్లోకి వెళితే.. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ఇసుకను తరలిస్తుండగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గల కంకణాల బాల్‌లింగంకు చెందిన పెంపుడు కుక్క ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. దీంతో బాల్‌లింగం, అతడి కుటుంబ సభ్యులు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫోన్ చేశారు. సకాలంలో స్పందించకపోవడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మూడు ట్రాక్టర్లకు ఒక్కోదానికి మూడు కూపన్లు ఇస్తే అంతకు మించిన ట్రిప్పులను తీసుకెళ్లేందుకు అతివేగంగా ట్రాక్టర్‌ను నడుపుతూ తమ కుక్క ప్రాణం పోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. అప్పటికీ రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించడం లేదని అసహనంతో వెంటనే ఎస్పీకి, కలెక్టర్‌కు జరిగిన ఘటనపై సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కూపన్ లేకుండా ఇసుకను తీసుకెళ్లేందుకు వాగులో ఉన్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని తహసీల్ కార్యాలయానికి తరలించారు. ఇసుక అక్రమ రవాణాపై ఆర్ఐ శ్రావణ్‌ను వివరణ కోరగా తాము అనుమతి ఇచ్చిన కూపన్ల కంటే అదనంగా ఇసుకను తరలించినట్లు గ్రామస్తులు ఆరోపించిన నేపథ్యంలో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. దీనిపై విచారణ చేస్తున్నామన్నారు. కుక్క చనిపోవడంపై బాల్‌లింగం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ట్రాక్టర్ డ్రైవర్ కంకణాల వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

# కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తద్దు

- అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్

కలెక్టరేట్, మార్చి 26 : యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తవద్దని అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. యాసంగి 2024-25 వరి కొనుగోలు సన్నాహక సమావేశం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించారు. దీనికి అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు వరి ధాన్యం గ్రేడ్ ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2300 నిర్ణయించిందని వెల్లడించారు. రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలని ఉద్దేశంతో జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 172 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 57కేంద్రాలు, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఆరు కేంద్రాల చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా సెంటర్ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, డీసీఎస్‌వో వసంత లక్ష్మి, డీఎం రజిత, అగ్రికల్చర్ ఏడీ రామారావు, జిల్లా కోఆపరేటివ్ అధికారి రామకృష్ణ, ఏడీఆర్డీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కులాల పేరు మార్పును పరిష్కరిస్తాం

- రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యం
- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

తమ కులం పేరును మార్చాలంటూ బీసీ కమిషన్‌కు మొరపెట్టుకుంటున్న సిరిసిల్ల దొమ్మరి కులస్తులు

రాజన్న సిరిసిల్ల, మార్చి 26 (నమస్తే తెలంగాణ): కులాల పేర్ల మార్పును వచ్చేనెలలో పరిష్కరిస్తామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో బీసీ కమిషన్ బృందం పర్యటించింది. పిచ్చకుంట్ల, దొమ్మరి, తమ్మలి, బుడబుక్కల తదితర కులాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిరిసిల్ల గీతానగర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అందించే బిల్లుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. కులం పేరుతో ఇబ్బంది పడుతున్న వారు ఆత్మన్యూనతా భావానికి గురికావద్దని, అండగా ప్రభుత్వం ఉందని భరోసా కల్పించారు. ఆయా కులాల పేర్ల మార్పు అంశం వచ్చే నెలలో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పర్యటించి కులాలతో ఇబ్బందులు పడుతున్నవారి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. త్వరలో మిగిలిన జిల్లాల్లో పర్యటించి వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటామన్నారు. బీసీ కులాల బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, తహసీల్దార్లు విజయ్‌ప్రకాశ్‌రావు, మహేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజమనోహర్‌రావు, బీసీ సంఘాల నాయకులు చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, దొమ్మరి కులం పేరు మార్చాలని కులం బాధ్యులు బీసీ కమిషన్‌కు మొరపెట్టుకున్నారు. తమ కులం పేరుతో తీవ్ర అవమానాలకు గురవుతున్నామని, తమల్ని ఆదరించడం లేదన్నారు. సమాజంలో పడుతున్న ఇబ్బందులను వివరించారు. తమ కులాన్ని గాడె వంశీయులుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషన్ చైర్మన్ కులాలపై అధ్యయనం చేసేందుకు తాము ఇక్కడికి వచ్చామని, తప్పకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### బీసీ కులాల స్థితిగతులు తెలుసుకునేందుకే పర్యటన

వేములవాడ టౌన్, మార్చి 26 : బీసీ కులాల్లోని పిచ్చకుంట్ల, బుడబుక్కల, దొమ్మరి, తమ్మల కులాల స్థితిగతులను తెలుసుకునేందుకు తాము పర్యటిస్తూ ఇక్కడికి వచ్చామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. బుధవారం వారు బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మితో కలిసి రాజన్నను దర్శించుకున్న అనంతరం వారు ఆలయ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుల గణన సర్వే నిర్వహించి, అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ పెంపు బిల్లు ఆమోదించిందని తెలిపారు. తమ కులం పేరు విద్యాలయాలు, ఉద్యోగ స్థలాల్లో పిలుచుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని, ప్రత్యామ్నాయ పేరు ఇవ్వాలని పిచ్చకుంట్ల, బుడబుక్కల, దొమ్మరి వారు విజ్ఞప్తులు అందజేశారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

# ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం

- అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ

సిరిసిల్ల టౌన్, మార్చి 26: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా పాలకవర్గం పనిచేస్తున్నదని అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో ది సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు అర్ధ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 అంచనా బడ్జెట్, బ్యాంకులో కొత్తగా చేర్చుకున్న సభ్యుల జాబితా, బైలా సవరణలు, షేర్ క్యాపిటల్ రూ.2కోట్ల నుంచి రూ.10కోట్లకి పెంచడం, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలలో బ్యాంకు సేవలను మరింత విస్తరించడం, ఉద్యోగుల పేస్కేల్ రివిజన్, తదితర అంశాలను మహాసభలో సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2023-24కు సంబంధించిన 12శాతం డివిడెంట్ ఖాతాదారులకు జమచేశామని, రాబోవు రోజుల్లో డివిడెంట్‌ను పెంచేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, మాజీ చైర్మన్లు గూడూరి ప్రవీణ్, గాజుల బాలయ్య, దార్నం లక్ష్మీనారాయణ, గాజుల నారాయణ, గడ్డం విఠల్, కార్యవర్గ సభ్యులు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్ రాజు, బుర్ర రాజు, వేముల సమ్మక్క, అడ్డగట్ల దేవదాస్, ఎనగందుల శంకర్, వలుస హరిణి, పత్తిపాక సురేశ్, కోడం సంజీవ్, బి రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# చౌడలమ్మకు చల్మెడ ప్రత్యేక పూజలు

కోనరావుపేట : సుద్దాల ఆలయంలో పూజలు చేస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, మార్చి 26: మండలంలోని సుద్దాల గ్రామంలో బుధవారం జరిగిన చౌడలమ్మ జాతర మహోత్సవానికి బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డితో కలిసి హాజయ్యారు. ఈ సందర్భంగా సుద్దాల గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, నేతలు రాఘవ రెడ్డి, నర్సయ్య, మహేశ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్, మార్చి 26 : వేములవాడ మండలం చింతల్‌ఠాణాలో జరిగిన శ్రీ మడేలేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, మాజీ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, ఆర్‌సీ రావు, మురళి, రాజయ్య, లింగరావు, అభిమన్యు, మహేశ్, ప్రమోద్, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

VEHICLE FOR SALE

★ Vehicle for Sale Hyundai XCent Disel Model 2018 Vehicle No. TS02FG5814 Contcat: Indusind Bank . Cell: 8790545692

NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

# సీహెచ్‌సీలో కాయకల్ప బృందం తనిఖీలు

ఎల్లారెడ్డిపేట సీహెచ్‌సీలో వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కాయకల్ప బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26: సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నంగునూరు కాయకల్ప బృందం సభ్యులు తనిఖీ చేశారు. బుధవారం సీహెచ్‌సీలో ఉన్న మౌలిక వసతులు, పరిసరాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ డాక్టర్ మంజుల, శ్రావణి, శ్వేత, లిఖిత, సీహెచ్‌సీ సిబ్బంది సూపరింటెండెంట్ బాబు, వైద్యాధికారి బాబు, రఘు, సిబ్బంది శిరీష, స్పందన ఉన్నారు.

# 'పది' పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల రూరల్, మార్చి 26: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైనారిటీ గురుకుల విద్యాసంస్థలో పదో తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష జరుగుతున్న సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట అధికారులున్నారు.

# బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో బాధితురాలికి చెక్కు అందజేస్తున్న సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి

ఇల్లంతకుంట, మార్చి 26 : రేపాక గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి సెస్ సంస్థ ద్వా రా ఆర్థిక సహాయం చేశామని సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో బుధవారం రేపాక గ్రామానికి చెందిన మొగులోజి రంగయ్య కొద్దిరోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మరణించగా వారి కుటుంబానికి రూ.5 లక్షల విలువైన చెక్కును అందజేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యుత్ షాక్‌తో మరణించడం బాధాకరమన్నారు. ఇక్కడ ఏఈ నగేశ్‌కుమార్ ఉన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట, మార్చి 26: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన ఐకేపీ జనార్దన్ రెడ్డి సతీమణి అమరం లత గుండెపోటుతో ఇటీవల మరణించగా బుధవారం కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. ఇక్కడ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, నాయకులు రాఘవరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య తదితరులున్నారు. సుద్దాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత ఉప్పుల అంజయ్య తండ్రి దేవయ్య ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

# గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కోనరావుపేట, మార్చి 26: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ. మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. 100,1098,1930 హెల్ప్‌లైన్ నెంబర్లను, పోక్సో చట్టం, స్వీయ రక్షణపై మహిళా సాధికారత కోఆర్డినేటర్ రోజా విద్యార్థులకు వివరించారు. యువత మొబైల్‌కు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ, వ్యక్తిగత శుభ్రతతో మెలగాలని, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని ఉన్నత స్థాయి చదువులు అభ్యసించాలన్నారు. ఇక్కడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి, జనరల్ స్పెషలిస్ట్ దేవిక తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీ అవార్డులు

వేములవాడ టౌన్, మార్చి 26 : సామాజిక, సాహిత్య సేవా రంగాల్లో కొన్నేళ్లుగా విశేష కృషి చేస్తున్న ఈశ్వరగారి ముక్తేశ్వరి ఫౌండేషన్ 2024లో ప్రచురించిన కథా సంపుటాలు, వ్యాస సంపుటాల రచయితల నుంచి సాహితీ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ ఈశ్వరగారి నరహరిశర్మ బుధవారం వెల్లడించారు. ఇందుకు కవిత, ఆధ్యాత్మిక సంపుటాల రచయితల నుంచి కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. ఒక్కో విభాగానికి రూ.10,116 నగదు పారితోషకం, జ్ఞాపికతో వేములవాడలోని ముక్తేశ్వరి ఫౌండేషన్ కార్యాలయంలో సత్కరిస్తామన్నారు. రచనలను ఏప్రిల్ 24లోగా మూడేసి ప్రతులను పంపించాలని తెలిపారు. వివరాలకు 9396 648880 నంబర్‌లో సంప్రదించగలరని వారు తెలిపారు.

# పాఠశాలకు చేయూత అభినందనీయం

ముస్తాబాద్, మార్చి 26: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలకు 1984-85 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.65 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్ వితరణ చేసి, పాఠశాలకు చేయూతనివ్వడం అభినందనీయమని మండల విద్యాధికారి రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నీటి శుద్ధి యంత్రం ప్రారంభించిన అనంతరం పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు. ఇక్కడ పూర్వ విద్యార్థులు నార్ల శ్రీనివాస్, ఎల్లమల లక్ష్మణ్ గౌడ్, డాక్టర్ కాజా, నసీరుద్దీన్, మద్ది రవి, ఎం శ్రీనివాసరావు, సతీశ్ మింగని లింగన్న, వెలుమల ప్రభాకర్ రెడ్డి, బండారి మల్లేశం, ఎన్ గోపాల్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి దూలం లక్ష్మీనారాయణ మాధవరెడ్డి, హెచ్ఎం ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

# కోతుల బెడద నివారించండి

సిరిసిల్ల టౌన్, మార్చి 26: కోతుల బెడద నివారించాలని కోరుతూ బుధవారం సిరిసిల్ల పట్టణంలోని సిద్దార్థ నగర్ కాలనీ వాసులు అటవీశాఖ అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, సిద్దార్థనగర్ కాలనీలో గుంపులుగా వచ్చిన కోతులు ఇండ్లలోకి చొరబడుతున్నాయని, తరిమేందుకు ప్రయత్నిస్తే దాడి చేస్తున్నాయన్నారు. ఇండ్లలోంచి బయటకు రావాలంటే భయపడుతున్నారని తెలిపారు. కోతుల నివారణకు సమస్యకు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ జూపల్లి నాగేదంర్‌రావు, గన్నమనేని శ్రీనివాస్‌రావు, వెన్నమనేని రాంచందర్ రావు, ఆంజనేయులు, వేణుగోపాల్, నరేశ్, తదితరులున్నారు.

# కనకవ్వను కరుణించండి

- రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు
- చికిత్స కోసం రూ.5లక్షలు అత్యవసరం
- దాతల సాయం వేడుకోలు

దాతలు సాయం కోసం సంప్రదించాల్సిన వివరాలు:
బ్యాంక్ పేరు: బ్యాంక్ ఆఫ్ బరోడా
బ్రాంచ్: వేములవాడ
ఖాతాదారుని పేరు: సందు రంజిత్
ఖాతా నెంబర్: 75660100014774
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: BARB0(ZERO)VJVEMU
ఫోన్ పే, గూగుల్ పే నంబర్: 7659971992

కోనరావుపేట, మార్చి 26: రెక్కాడితే గానీ డొక్కాడే ఆ నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టం రావడంతో దిక్కుతోచని స్థితిలో పడింది. ప్రమాదవశాత్తు కనుకవ్వ రోడ్డు ప్రమాదంలో గాయడపడంతో చికిత్స కోసం డబ్బులు లేక అల్లాడుతోంది. దీంతో చేసేదేం లేక ఆ కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. వివరాల్లోకి వెళితే, కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన సందు కనుకవ్వ ఇటీవల తన కుమారుడితో ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగపల్లి గ్రామానికి బంధువులు మరణిస్తే పరామర్శించేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శివంగాళపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై రాళ్ల కుప్ప ఉండడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కనుకవ్వ తలకు తీవ్రగాయాలు కాగా సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు తలకు బలమైన గాయాలు తగిలాయని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో వైద్యులు పరీక్షించి చికిత్స కోసం రూ.5 లక్షలు అత్యవసరమని తేల్చి చెప్పారు. కుటుంబ సభ్యులు చేతిలో చిల్లిగవ్వ లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు సహకరించి తన తల్లిని కాపాడాలని వేడుకుంటున్నారు.

# రాజన్న హుండీ ఆదాయం కోటీ 95 లక్షలు

వేములవాడ టౌన్,మార్చి 26 : వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి హుండీ ఆదాయం ఒక కోటీ 95 లక్షలా 75 వేల 168 రూపాయలు సమకూరినట్లు ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై నిర్వహించిన హుండీ లెక్కింపులో 287గ్రాముల బంగారం, 18కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు, ఈ ఆదాయం కేవలం 20 రోజులది మాత్రమేనని వెల్లడించారు. ఇక్కడ ఏఈవోలు, పర్యవేక్షకులు,ఆలయ ఇన్‌స్పెక్టర్లు, ఎస్పీఎఫ్ సిబ్బంది, రాజరాజేశ్వర భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో 300 మంది భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలి

వీర్నపల్లి, మార్చి 26: విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని సఖీ కేంద్రం జిల్లా కో అర్డినేటర్ రోజా అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పోక్సో చట్టం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆపదలో ఉన్న మహిళలు, విద్యార్థినులు హెల్ప్‌లైన్ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు సరిత, రవి, రామస్వామి, పీడీ ప్రతాప్ ఉన్నారు.

# గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవు

ఎల్లారెడ్డిపేట, మార్చి 26: గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బుధవారం హెచ్చరించారు. మంగళవారం దేవునిగుట్ట తండాకు చెందిన దరావత్ కమల 5 లీటర్ల సారా విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కింది. దీంతో మొదటిసారి చేసిన తప్పుగా భావించి బుధవారం ఆమెను తహసీల్దార్ డీ సుజాత ఎదుట ఏడాది కాలానికి రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేశారు. ఇక్కడ సిబ్బంది కిషోర్ కుమార్, మల్లేశ్, రాజు ఉన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

వీర్నపల్లి, మార్చి 26: వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ అన్నారు. మండల కేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయ ఆవరణలో రూ.2 లక్షల నిధులతో బోరు వేయించి, మోటర్ బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటిని వృథా చేయవద్దన్నారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉంటే తెలుపానికి సూచించారు. ఇక్కడ కాలనీ వాసులున్నారు.

# కోర్టు తీర్పు హర్షణీయం

ఇల్లంతకుంట, మార్చి 26 : మండలంలోని రెండు పీఏసీఎస్ పాలకవర్గాలను కొనసాగించాలంటూ కోర్టు తీర్పు ఇచ్చిందని, దాని అనుమతి పత్రాలను జిల్లా అధికారి చేతుల మీదుగా బుధవారం తీసుకున్నామని ఇల్లంతకుంట పీఏసీఎస్ చైర్మన్ రోండ్ల తిరుపతి రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు గాలిపెల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాన్ని కొనసాగించాలని కోర్టు తీర్పు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు మేరకు పీఏసీఎస్ పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు.

# రాజన్న ఆలయంలో అంతర్గత బదిలీలు

వేములవాడ టౌన్, మార్చి 26: పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఒక ఏఈవోతోపాటు 17 మంది ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేసినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. బదిలీ అయిన ఉద్యోగులు విధిగా తమకు బదిలీ అయిన స్థానంలో విధుల్లో చేరాలని ఈవో ఆదేశించారు.

# ఇసుక లారీ, ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 26 : మండలంలోని వెంకట్రావుపల్లి శివారు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకుని సీజ్ చేశామని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఉదయం ఎలాంటి అనుమతి లేకుండా ట్రక్‌లో ఇసుక తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా లోడుతో ఉన్న లారీ, సిద్దిపేట జిల్లా నారాయణరావు పేట మండలం మాటేండ్ల గ్రామానికి చెందిన మల్కి నగేశ్ (28) పై కేసు నమోదు చేశామని తెలిపారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఫిర్యాదు మేరకు మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన దొమ్మాటి అజయ్ (22) అనుమతి లేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుక రవాణా చేస్తుండగా పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఆయనపై కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

# ఒకరికి ఏడాది జైలు

గాంధీచౌక్, మార్చి 26 : మహిళపై దాడ